


# కరపత్రం

SINCE 2014

సోమవారం ఫిబ్రవరి 23, 2026 సంపుటి : 2 సంచిక : 136 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4



## రెండేళ్లలో అన్ని ప్రాజెక్టులు పూర్తి చేస్తాం: సీఎం రేవంత్

- దేవాదుల ప్రాజెక్టును పరిశీలించిన సీఎం
- రెండేళ్లలో ప్రాజెక్టుల పూర్తి లక్ష్యం
- నిధుల కొరతపై స్పష్టీకరణ
- గోదావరి జలాలపై రాజకీయ విమర్శలు
- కాళేశ్వరం పై వ్యాఖ్యలు
- అసెంబ్లీలో చర్చకు ఆహ్వానం
- చౌకబారు రాజకీయాలకు హెచ్చరిక
- అధికారులతో సమీక్షా సమావేశం
- నీటి లభ్యతపై వివరాల ఆరా
- మంత్రులతో కలిసి ప్రాజెక్టు సందర్శన

ములుగు:
గోదావరి జలాల అంశం రాజకీయ రంగు పులుముకుందన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. రాష్ట్రం ఏర్పడినప్పుడు నీళ్లు, నిధులు బాగా ఉన్నాయని, సకాలంలో ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఎంతో మేలు జరిగేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసమే రూ. లక్ష కోట్లు ఖర్చు చేశారని విమర్శించారు సీఎం రేవంత్.

రెండేళ్లలో అన్ని ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, ప్రస్తుతం నిధుల కొరత ఉందని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. కాళేశ్వరం గొప్ప ప్రాజెక్టు అనుకుంటే అది భ్రమేనని తేలిపోయిందన్నారు. ఇక కృష్ణా జలాల తరలింపుపై సభలో క్లారిటీ ఇచ్చామన్నారు. గోదావరి జలాల వివాదంపై అసెంబ్లీఓ చర్చిద్దామన్నారు. చౌకబారు రాజకీయాలతో తెలంగాణ ప్రతిష్టను దెబ్బతీయొద్దని విజ్ఞప్తి చేశారు. ఈరోజు(ఆదివారం, ఫిబ్రవరి 22వ తేదీ) దేవాదుల ప్రాజెక్టును పరిశీలించారు సీఎం రేవంత్.
దీనిలో భాగంగా ఇంజనీరింగ్ అధికారులతో నీటి లభ్యత వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంజనీరింగ్ అధికారులు, ఉమ్మడి జిల్లా కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌తో పాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, సీఎం సలహాదారు వేం నరేంద్రరెడ్డి, ఎంపీ బలరాం నాయక్, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## పేదల ఇళ్లు కూల్చి బడా బాబులకు భూములు కట్టబెట్టే కుట్ర: హరీశ్‌రావు

- మూసీ సుందరణపై హరీశ్‌రావు ఆరోపణలు
- రియల్ ఎస్టేట్ దోపిడీ చేస్తున్నారన్న విమర్శ
- భూముల కబ్జాలపై ధ్వజమెత్తిన మాజీ మంత్రి
- డీపీఆర్, ఎఫ్‌టీఎల్‌పై ప్రశ్నలు
- నోటీసుల జారీపై ఆగ్రహం
- పేదల తరపున నిలదీస్తామన్న హెచ్చరిక
- మధు పార్క్ నోటీసులు వెనక్కి తీసుకోవాలన్న డిమాండ్
- ప్రభుత్వ అడుగులపై అనుమానాలు
- బుల్డోజర్ల రాజకీయమన్న విమర్శ
- అసెంబ్లీలో పోరాటానికి సిద్ధం



హైదరాబాద్:
మూసీ సుందరణ పేరిట సీఎం రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ దోపిడీ చేస్తున్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. సీఎం వేసే ప్రతి అడుగు వెనుకా భూముల కబ్జాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారమే ఉందన్నారు. "పేదల ఇళ్లు కూల్చి బడాబాబులకు భూములు కట్టబెట్టే కుట్ర జరుగుతోంది. కేసీఆర్ మంచినీళ్లు ఇచ్చి బతుకులను నిలబెడితే.. రేవంత్‌రెడ్డి బుల్డోజర్లు పెట్టి వారి జీవితాలను కూలగొడుతున్నారు. డీపీఆర్ లేదు.. ఎఫ్‌టీఎల్ తేలలేదు.. అనుమతులు లేవు. ఏ చట్టం ప్రకారం ఇళ్లు ఖాళీ చేయాలని నోటీసులు ఇస్తున్నారు? మధు పార్క్ అపార్ట్‌మెంట్‌కు ఇచ్చిన నోటీసులను బేషరతుగా వెనక్కి తీసుకోవాలి. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పేదల తరపున ప్రభుత్వాన్ని నిలదీస్తాం"అని హరీశ్‌రావు అన్నారు.



## కృష్ణా, గోదావరి జలాల్లో ఒక్క చుక్క వదులుకోం: మంత్రి ఉత్తమ్

ములుగు:
కృష్ణా, గోదావరి జలాల్లో ఒక్క చుక్క నీటిని కూడా వదులుకోకుండా తెలంగాణ హక్కులు కాపాడతామని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం (ఫిబ్రవరి 22) ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెంలోని దేవాదుల ప్రాజెక్టును సీఎం రేవంత్ రెడ్డి,

2లో..




## రచయిత బొగ్గుల శ్రీనివాస్ హత్య కేసు.. వీడిన మిస్టరీ

ఖమ్మం జిల్లా:
పాలేరు రిజర్వాయర్‌లో కారు ప్రమాదంలో మృతి చెందిన రచయిత బొగ్గుల శ్రీనివాస్ మృతి కేసును పోలీసులు ఛేదించారు. బొగ్గుల శ్రీనివాస్‌ది హత్యగా పోలీసులు తేల్చారు. ఈ కేసులో నలుగురు వ్యక్తులను కూసుమంచి పోలీసులు అరెస్ట్ చేశారు. ఆర్థిక లావాదేవీలే హత్యకు కారణమని పోలీసులు వెల్లడించారు.



## భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అరెస్ట్

» గృహ నిర్బంధం తర్వాత అరెస్ట్
» తార్నాకలో పోలీసులు అదుపులోకి
» నివాసం వద్ద ఉద్రిక్తత
» కార్యకర్తలతో తోపులాట
» బయల్దేరడంతో అరెస్ట్
» పోలీసుల ముందస్తు చర్యలు
» బాన్సువాడ ప్రయాణం అడ్డం
» పీఎస్‌కు తరలింపు
» పలువురు కార్యకర్తలు అదుపులో

హైదరాబాద్:
భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావును పోలీసులు అరెస్ట్ చేశారు. తార్నాకలోని ఆయన నివాసం వద్ద పోలీసులు అరెస్ట్ చేసి పీఎస్‌కు తరలించారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడలో రెండు వర్గాల మధ్య ఇటీవల ఘర్షణ జరిగింది. ఈ ఘటన నేపథ్యంలో అక్కడికి వెళ్లేందుకు రామచందర్‌రావు యత్నించగా.. పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఆ తర్వాత కూడా ఆయన బయల్దేరడంతో అరెస్ట్ చేశారు.ఈ సందర్భంగా రామచందర్‌రావు నివాసం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు, భాజపా కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. పలువురు భాజపా కార్యకర్తలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



## మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఇంట్లో సోదాలు!

మందమర్రి పట్టణం: మంచిర్యాల జిల్లా క్యాతనపల్లిలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఇంట్లో ఆదివారం పోలీసులు సోదాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. బాల్క సుమన్ ఇంటి ముందు మాజీ కౌన్సిలర్ రేవెల్లి ఓదెలు, కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న శ్రీనివాస్ మాట్లాడుకుంటున్నారు. ఈ క్రమంలో ఆర్కేపీ ఎస్సై శ్రీధర్, ముగ్గురు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఇంటికి వేసిన తాళం తీయించి అన్ని గదుల్లో సోదాలు నిర్వహించినట్లు సమాచారం.



## ప్రశ్నిస్తే దాడులు చేయడమా?

### - కేంద్రమంత్రి బండి సంజయ్

హైదరాబాద్:
ప్రశ్నిస్తే కాంగ్రెస్ నేతలు దాడులు చేయడమేంటని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. రాష్ట్రంలో రౌడీ రాజ్యం నడుస్తోందా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు."రాష్ట్రంలో ఎమర్జెన్సీ రోజులు ప్రారంభమయ్యాయి. ఎంఐఎం, కాంగ్రెస్ కలిసి అరాచాకాలు సృష్టిస్తున్నాయి. భాజపా కార్యకర్తలారా.. వీటిని అడ్డుకునేందుకు సిద్ధంకండి. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో జరిగిన సంఘటనలను గుర్తుంచుకోండి.

## సీఎం రేవంత్‌పై అరవింద్ తీవ్ర విమర్శలు

- బీజేపీ కార్యాలయంలో అరవింద్ ప్రెస్‌మీట్
- ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు
- హౌస్ అరెస్టులపై మండిపాటు
- ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కుతున్నారన్న విమర్శ
- రాష్ట్ర పాలనపై ధ్వజమెత్తిన అరవింద్
- ఎమ్మెల్యేపై దాడి ఘటనపై ప్రశ్నలు
- కాంగ్రెస్ ధోరణిపై విమర్శలు
- హిందువులను భయపెడుతున్నారన్న ఆరోపణ
- కఠిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్
- దాడి ఘటనలపై స్పందించాలన్న విజ్ఞప్తి



హైదరాబాద్:
సీఎం రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ తీవ్ర విమర్శలు చేశారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు.
కాంగ్రెస్ పార్టీకి ఈ రెండేళ్లలో అధికంగా డబ్బు సంపాదించి అది కొవ్వుగా మార్చుకున్నారని దీంతో అక్రమ హౌస్ అరెస్టుల పేరుతో ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో రేవంత్ అరాచక పాలన నడుస్తుందన్నారు. అమ్మాయిపై ఒక వర్గం వారు దౌర్జన్యం చేస్తే మరో వర్గం వారిని అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని హిందువులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు.

మిగతాద్ది 2 లో

## ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డికి పోలీసుల నోటీసులు



హైదరాబాద్:
ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డికి, ఆయన కుమారుడు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డికి ఇబ్రహీంపట్నం పోలీసులు నోటీసులు జారీ చేశారు. క్రైం నెంబర్ 119/2026 కింద బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం పోలీసులు నోటీసు జారీ చేశారు. కౌన్సిలర్ ఎన్నికల సర్టిఫికేట్, మొబైల్ ఫోన్ బలవంతంగా లాక్కొని, బాధితుడిని మూడు రోజుల పాటు నిర్బంధించారని ఆరోపణలు ఉన్నాయి.ఈ కేసులో పలు సెక్షన్ల కింద నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు బాధితుడి ఫోన్ వెంటనే తిరిగి ఇవ్వాలని సూచించారు. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసులో స్పష్టం చేశారు.

02

## నిర్వాసితులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధికి హరీశ్‌రావు యత్నం - ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



హైదరాబాద్:
మూసీ ప్రాజెక్టుపై మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్‌ఎస్ నేతలు విషం చిమ్ముతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ విమర్శించారు. మూసీ నదిని ప్రక్షాళన చేయడం వాళ్లకు ఇష్టం లేదన్నారు.

2లో..

# సీఎం రేవంత్‌పై అరవింద్ తీవ్ర విమర్శలు

మొదటి పేజీ తరువాయి
MLA వెంకటరమణారెడ్డిపై దాడి జరిగితే కాంగ్రెస్ నేతలు కనీసం స్పందించారా? ఎమ్మెల్యేపై దాడి గురించి ఏమైనా ఆరా తీశారా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేల రెస్పాన్సిబులిటీ స్పీకర్ ది కాదా అని ప్రశ్నించారు.
సీఎం రేవంత్ చాలా డేంజరని ఆరోపించారు. కేసీఆర్ ధోరణిలోనే కాంగ్రెస్ సైతం హౌస్ అరెస్టులు చేస్తుందని వాటిని తాము ఖండిస్తున్నామని అరవింద్ తెలిపారు. సూపర్ మార్కెట్ లోకి వచ్చి గొడవ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మీూా క్యాంప్ ఆఫీస్ పై దాడికి వచ్చిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ఎంపీ డిమాండ్ చేశారు.

# రచయిత బొగ్గుల శ్రీనివాస్ హత్య కేసు.. వీడిన మిస్టరీ

మొదటి పేజీ తరువాయి
హత్య చేసిన అనంతరం కారు ప్రమాదంగా నిందితులు చిత్రీకరించే యత్నం చేశారు. మృతుడి శరీరంపై గాయాలు ఉండటం.. శ్రీనివాస్ కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేసిన పోలీసులు హత్యగా తేల్చారు. ఈనెల 14న ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్‌లోకి కారు దూసుకెళ్లడంతో ఏపీకి చెందిన బొగ్గుల శ్రీనివాస్ మృతి చెందారు. రిజర్వాయర్‌లోకి కారు దూసుకెళ్లాక డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి బయటకు వచ్చి పారిపోయినట్లు స్థానికులు చెప్పడంతో ఆ దిశగా పోలీసులు విచారణ చేపట్టారు. ఆయన సోదరుల ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు పలు కీలక ఆధారాలు సేకరించారు.
శ్రీనివాస్ ప్రయాణించిన కారు ఏపీలోని పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన వేణుమాధవ రెడ్డిదిగా గుర్తించారు. ఘటన జరిగినప్పటి నుంచి ఆయన ఆచూకీ లేకపోవడంతో ఆ దిశగా విచారణ చేపట్టారు. వేణుమాధవరెడ్డి, శ్రీనివాస్ మధ్య కొంతకాలంగా విభేదాలు ఉన్నాయని గుర్తించారు. దర్యాప్తులో శ్రీనివాస్‌ది హత్యగా తేల్చారు.

# ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డికి పోలీసుల నోటీసులు

మొదటి పేజీ తరువాయి
నిబంధనలు పాటించకపోతే అరెస్ట్ చేసే అవకాశముందని పోలీసులు హెచ్చరించారు.

**- ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, ఆయన కుమారుడు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డికి నోటీసులు జారీ చేసిన పోలీసులు**

**- ఇంటికి తాళం ఉండడం వల్ల వారు అందుబాటులో లేకపోవడంతో, హైదరాబాద్ మలక్‌పేట్‌లోని తిరుమల హిల్స్‌లో ఉన్న వారి నివాసానికి వెళ్లిన పోలీసులు**

**- నోటీసులు అతికించి, పలు సెక్షన్ల కింద ఇద్దరిపై కేసు నమోదు**

# కృష్ణా, గోదావరి జలాల్లో ఒక్క చుక్క వదులుకోం: మంత్రి ఉత్తమ్

మొదటి పేజీ తరువాయి
మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు.
ఈ సందర్భంగా ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ.. 2027నాటికి దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేస్తామని.. 5 లక్షల పైచిలుకు ఆయకట్టుకు నీరందిస్తామని చెప్పారు. రెండేళ్లలో గోదావరి నది బేసిన్?లో ఉన్న అన్ని ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. గోదావరి బేసిన్?లో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి పంటలు పండాయని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ 2026, జూన్ 2వరకు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

# ప్రశ్నిస్తే దాడులు చేయడమా?

మొదటి పేజీ తరువాయి
కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు చట్టాన్ని చేతుల్లో తీసుకోవడం దుర్మార్గం. కామారెడ్డిలో భాజపా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఇంటిపై దాడి అమానుషం. అగ్నికి ఆజ్యం పోసింది కాంగ్రెస్సే. బాన్సువాడలో 70 మందిని అక్రమంగా అరెస్ట్ చేశారు. రాళ్ల దాడి స్పష్టంగా కనిపిస్తున్నా చర్యలేవీ?బాన్సువాడ వెళ్లేందుకు యత్నించిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడిని అరెస్ట్ చేయడం అన్యాయం. ఎంఐఎంను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది" అని బండి సంజయ్ అన్నారు.

# మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఇంట్లో సోదాలు!

మొదటి పేజీ తరువాయి
అనంతరం ఇద్దరి వద్ద ఉన్న చరవాణులు తీసుకెళ్లి కొంతసేపటి తర్వాత తిరిగిచ్చేశారు. ఈ విషయమై ఎస్సై శ్రీధర్‌ను వివరణ కోరగా ఎలాంటి సోదాలు నిర్వహించలేదన్నారు. మంత్రి కాన్వాయ్ మీద జరిగిన దాడికి సంబంధించి కేసులో నిందితులుగా ఉన్న వారు అక్కడ ఉన్నారని సమాచారం అందడంతో వెళ్లామన్నారు.

# నిర్వాసితులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధికి హరీశ్‌రావు యత్నం

మొదటి పేజీ తరువాయి
"మూసీ పరివాహక ప్రాంతం శుభ్రపడితే హైదరాబాద్ ప్రజలు ఎప్పటికీ సీఎం రేవంత్‌ను గుర్తుపెట్టుకుంటారనే భయం బీఆర్‌ఎస్ నేతల్లో ఉంది. గతంలో హుస్సేన్‌సాగర్ నీళ్లను కొబ్బరి నీళ్లు చేస్తానని కేసీఆర్ బడాయి కబుర్లు కెపపారు. మూసీ కోసం రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పి నగర ప్రజలను కేటీఆర్ మోసం చేశారు.
గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం భూసేకరణ జరుపుతోంది. నిర్వాసితుల డిమాండ్లను ప్రభుత్వం పరిశీలిస్తుంది. వాళ్లు సంతృప్తి చెందేలా పరిహారం ఇస్తాం. రెచ్చగొట్టి రాజకీయ లబ్ధిపొందాలని హరీశ్‌రావు ప్రయత్నిస్తున్నారు. ఓ అపార్ట్‌మెంట్‌కు నోటీసులు ఇచ్చామని అక్కడికి వెళ్లి సానుభూతి చూపిస్తున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో మల్లన్నసాగర్ కోసం 14 గ్రామాలను బలవంతంగా ఖాళీ చేయించినప్పుడు హరీశ్‌రావుకు ఇవి గుర్తులేదా?మూసీ నిర్వాసితులు ప్రతిపక్షాల వలలో చిక్కుకోవద్దు" అని బల్మూరి వెంకట్ అన్నారు.

# నెలఖరు వరకు తెలంగాణలో పత్తి కొనుగోళ్లు
## -ప్రభుత్వం విజ్ఞప్తితో సిసిఐ నిర్ణయం

తెలంగాణలో ఈ నెలాఖరు వరకు పత్తి కొనుగోళ్లు చేయనున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తితో సీసీఐ నిర్ణయం తీసుకుంది. జాయింట్ సెక్రెటరీ, కేంద్ర జౌళిశాఖకి రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి లేఖ రాశారు. పత్తి కొనుగోళ్ల గడువును పొడిగించాలని ఇప్పటికే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని మంత్రి తుమ్మల కోరారు. కేంద్ర ప్రభుత్వం, సీసీఐ నిర్ణయంతో మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. అయితే పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ చొరవతో కూడా పత్తి రైతులకు ఊరట లభించింది. సీసీఐ సంస్థ పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందారు. ఈ క్రమంలో సమస్యను ఎంపీ వంశీ దృష్టికి తీసుకెళ్లారు రైతులు. వెంటనే స్పందించిన ఎంపీ వంశీ.. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా( సీసీఐ)తో మాట్లాడి ప్రొక్యూర్మెంట్ గడువును పొడిగించాలని కోరారు. రైతులకు సంబంధించిన పత్తి పంట ఇంకా పూర్తి దశలోకి చేరుకోలేదని.. ఇంకా పత్తి తీసే దశ ఉందని సీసీఐ దృష్టికి తీసుకెళ్లారు. పత్తి కొనుగోళ్ల పక్రియను మరికొన్ని రోజులు కొనసాగించాలని ఆయన కోరారు. ఎంపీ వంశీ లేఖకు స్పందించిన సీసీఐ సంస్థ మరో 7 రోజులు పత్తి కొనుగోళ్లు చేసుకోడానికి వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అవకాశాన్ని నియోజకవర్గ రైతులు సద్వినియోగం చేసుకోవాలనీ ఎంపీ వంశీ కోరారు. ఎంపీ వంశీ కృష్ణ చేసిన కృషికి హర్షం వ్యక్తం చేశారు స్థానిక రైతులు.

# విద్యార్థులకు పోలీస్ శాఖ ఇంటర్న్‌షిప్

హైదరాబాద్ సిటీ పోలీసులు వినూత్న నిర్ణయం తీసుకున్నారు. డేటా అనాలసిస్, రీసెర్చ్ ప్రాజెక్టులు, ఆధునిక పోలీసింగ్‌లో విద్యార్థులను భాగస్వాములను చేయాలన్న లక్ష్యంతో.. 25 ఏళ్లలోపు డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం నిర్వహించనున్నారు. ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన వారికి అధికారిక ధ్రువపత్రాలు ఇవ్వనున్నారు. ఎస్‌ఎంఐటీ సెల్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించ బోతున్నట్లు చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలని సూచించారు.

# కరీంనగర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
## బైక్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరు మృతి

కరీంనగర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి రాజీవ్ రహదారిపై బైక్ ను కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్ పై వెళ్తోన్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. హుస్నాబాద్ నుంచి తోటపల్లికి వెళ్తుండగా కొత్తపల్లి దగ్గర ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనతో కాసేపు హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. స్తానికుల సమాచారంతో ఘటనా స్తలానికి వచ్చిన పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.
మృతులు అవదూత శ్రీనివాస్, శ్రీరామ రామచంద్రంగా గుర్తించారు. వీరిద్దరూ బొమ్మనపల్లి మండలం చిరుగుమామిడి గ్రామస్తులుగా గుర్తించారు పోలీసులు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందడంతో స్తానికులు శోకసంద్రంలో మునిగిపోయారు.

# మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం

**- వాసుదేవరెడ్డిని అదుపులోకి తీసుకున్న సిట్**

మద్యం కుంభకోణం కేసులో.. విచారణను సిట్ వేగవంతం చేసింది. ఈ కేసులో ప్రధాన సూత్రధారుల్లో ఒకరైన వాసుదేవరెడ్డిని పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. దాదాపు రూ. 3,500 కోట్ల మేర అవినీతి జరిగినట్లు ఆరోపణలు వస్తున్న ఈ కేసులో వాసుదేవరెడ్డి అరెస్ట్ అత్యంత కీలకంగా మారింది.వాసుదేవరెడ్డి వైసీపీ హయాంలో బెవరేజెస్ కార్పొరేషన్‌లో కీలక బాధ్యతల్లో ఉండి, మద్యం పాలసీ రూపకల్పన, కంపెనీల ఎంపికలో కీలక పాత్ర పోషించినట్లు సిట్ అధికారులు నిర్ధారించారు. మద్యం కుంభకోణంలో వాసుదేవరెడ్డిని రెండో నిందితుడిగా (ఎ2) సిట్ అధికారులు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆయన కొన్ని మద్యం కంపెనీలకు లబ్ది చేకూర్చారని ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ.. సిండికేట్లకు మేలు చేస్తూ వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడినట్లు సిట్ అధికారుల దర్యాప్తులో తేలింది. ఈ కేసులో అరెస్ట్ నుంచి తప్పించుకోవడానికి వాసుదేవరెడ్డి ఇప్పటికే కింది కోర్టులో ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే కోర్టు బెయిల్ నిరాకరించడంతో ఆయన ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో విచారణ జరుగుతుండగానే పోలీసులు ఆయన్ని అదుపులోకి తీసుకోవడం గమనార్హం. ఈ కేసులో కీలక వ్యక్తుల పేర్లు బయట పెట్టేందుకు వాసుదేవరెడ్డి 'అప్రూవర్' గా మారే అవకాశం ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఒకవేళ ఆయన అప్రూవర్‌గా మారితే.. ఈ కుంభకోణం వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరనేది బయటకు వచ్చే అవకాశం ఉంది. వాసుదేవరెడ్డి అరెస్ట్‌తో ఏపీ రాజకీయాల్లో వేడి రాజుకుంది. మద్యం సరఫరాలో జరిగిన అవకతవకలు, డిజిటల్ పేమెంట్లకు అవకాశం ఇవ్వకుండా నగదు రూపంలో జరిగిన లావాదేవీలపై సిట్ అధికారులు దృష్టి సారించారు. ఆయన అరెస్ట్ తర్వాత మరికొంత మంది అధికారులు, రాజకీయ నేతలకు నోటీసులు అందే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

# ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ షెడ్యూల్ విడుదల

తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ 2026 సంవత్సరానికిగానూ 10వ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల టైమ్‌టేబుల్‌ను విడుదల చేసింది. పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు ఇప్పుడు పూర్తి షెడ్యూల్‌ను చూసుకోవాలని సూచించింది. షెడ్యూల్‌ను పూర్తిగా తేదీల వారీగా పరిశీలించుకోవాలని పేర్కొన్నది. తాజా టైమ్‌టేబుల్ ప్రకారం.. పదో తరగతి, ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు ఏప్రిల్ 20వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలు ఉదయం మధ్యాహ్నం
రెండు షిప్టుల్లో జరగనున్నాయి. ఉదయం షిఫ్ట్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం షిఫ్ట్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సాగనుంది. ఆ తర్వాత ఏప్రిల్ 28 నుంచి మే 5వ తేదీ వరకు ఇంటర్నల్స్, ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి.

# గడ్డి మందుతో ప్రాణాలు హరీ

మనుషుల ప్రాణాలను హరిస్తున్న పారాక్వాట్ డిక్లోరైడ్ గడ్డి మందు వాడకుండా నిషేధం విధించాలని, దీనిపై ప్రభుత్వం ఆలోచన చేయాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. ప్రతి నెలా ఈ మందు తాగి పదుల సంఖ్యలో కరీంనగర్, వరంగల్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేరి మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉందని అన్నారు. ఈ మందుకు విరుగుడు మందు లేకపోవడం వల్ల తాగిన వ్యక్తులు చనిపోతున్నారని పేర్కొన్నారు. పారాక్వాట్ డిక్లోరైడ్ వాడకాన్ని ఒడిశా ప్రభుత్వం ప్రతి ఆరు నెలల పాటు నిషేధిస్తూ వస్తోందని, ప్రపంచంలో 70 దేశాలు ఈ గడ్డి మందును నిషేదించాయని వెల్లడించారు. పారా క్విట్ డై క్లోరైడ్‌ను నిషేధించాలని సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖా మంత్రి, సీఎస్ రామకృష్ణారావు, రైతు కమిషన్ చైర్మన్ కోదండరామ్ రెడ్డి,ఇండియన్ మెడికల్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ కిషన్‌కు లేఖ రాశారని వివరించారు.తెలుగు రాష్టాల్లో్ర పారా క్విట్ డై క్లోరైడ్ గడ్డి మందు తాగి ఎక్కువ మంది చనిపోతున్నారని కొందరు వైద్యులు కూడా వెల్లడించారు. ఈ గడ్డి మందు వాడకంపై గ్రామాల్లో తిరిగి ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నామని, దీనిని నిషేధించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని పేర్కొన్నారు. ఎండో సల్ఫన్ అనే మందును ఇండియాలో బ్యాన్ చేసినట్లుగానే పారాక్వాట్ డిక్లోరైడ్ గడ్డి మందు త్రాగి బ్రతికేవాళ్లు సైతం సైడ్ ఎఫెక్ట్స్ తో చనిపోతున్నారని వివరించారు. పారాక్వాట్ డిక్లోరైడ్ గడ్డి మందును వాడిన తర్వాత మిగిలిన మందును రైతులు దాచుకోవద్దని సూచించారు.

# స్వావలంబనతోనే అభివృద్ధి సాధ్యం
## ప్రధాని నరేంద్ర మోదీ

భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే స్వావలంబన సాధించడం అవసరమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దీనికోసం సెమీకండక్టర్ చిప్‌ల తయారీ సామర్థ్యాన్ని కలిగి ఉండటం ఎంతో ముఖ్యమని తెలిపారు. హెచ్‌సీఎల్ గ్రూప్, ఫాక్స్‌కాన్ కలిసి ఉత్తర్‌ప్రదేశ్‌లోని జేవర్‌లో ఏర్పాటు చేయనున్న సెమీకండక్టర్ పరిశ్రమకు ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. 'వికసిత భారతానికి 'మేడ్ ఇన్ ఇండియా' చిప్‌లు ఎంతో ముఖ్యం. కరోనా సమయంలో చిప్‌ల సరఫరా వ్యవస్థ దెబ్బతినడంతో.. అనేక ఆర్థిక వ్యవస్థల అభివృద్ధి నిలిచిపోయింది. వివిధ కర్మాగారాల్లో పనులు ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో చిప్‌ల తయారీలో స్వావలంబన సాధించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత దశాబ్దంలో సాంకేతికపరంగా మనం తీసుకుంటున్న చర్యలు.. 21వ శతాబ్దంలో దేశ శక్తిసామర్థ్యాలకు పునాదులు అవుతాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. హెచ్‌సీఎల్ గ్రూప్, ఫాక్స్‌కాన్ సంస్థలు కలిసి జేవర్‌లో 'ఔట్‌సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్' (ఓఎస్ఏటీ) కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నాయి. దీని కోసం రూ.3,700 కోట్ల పెట్టుబడిని ప్రకటించాయి. 2028 నాటికి ఇది అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ పరిశ్రమ 3,500 ఉద్యోగాలు సృష్టిస్తుందని అంచనా. ఈ ప్లాంట్ నెలకు 3.6 కోట్ల చిప్‌ల ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంటుందని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

# ట్రైన్ ఎక్కుతూ కిందపడ్డ ప్రయాణికుడు

**-తీవ్ర గాయాలతో మృతి**

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో శనివారం విషాద ఘటన చోటుచేసుకుంది. ట్రైన్ ఎక్కే సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడిన వ్యక్తి.. తీవ్ర గాయాలతో మృతిచెందాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపగా, రైల్వే ప్రయాణికుల్లో భయాందోళనలు కలిగించింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగరాజు అనే వ్యక్తి సికింద్రాబాద్ నుంచి ఒంగోలు వెళ్లేందుకు స్టేషన్‌కు వచ్చాడు. సింహపురి ఎక్స్‌ప్రెస్ ట్రైన్ ఎక్కాల్సి ఉండగా.. తొందరలో మరో ట్రైన్‌ను ఎక్కేందుకు ప్రయత్నించాడు. ట్రైన్ కదులుతున్న సమయంలో కాలు జారి ప్లాట్‌ఫామ్‌కు, ట్రైన్‌కు మధ్యలో పడిపోయాడు. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలై మృతిచెందాడు. ఈ ఘటన మరోసారి రైల్వే ప్రయాణికులకు అప్రమత్తత అవసరాన్ని గుర్తు చేసింది. ట్రైన్ కదులుతున్న సమయంలో ఎక్కేందుకు ప్రయత్నించకూడదని, అలాంటి చర్యలు ప్రాణాపాయానికి దారి తీస్తాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు. రైల్వే స్టేషన్‌లలో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికులు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. నాగరాజు మృతితో.. టుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

# యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలు

శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. 11 రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శనివారం ఉదయం వటపత్రశాయి అలంకారంలో లక్ష్మీనరసింహస్వామి దర్శనమిచ్చారు. రాత్రి హంస వాహనంపై స్వామివారు ఊరేగారు. బ్రహ్మోత్సవాలు, వారాంతం కావడంతో యాదగిరిగుట్టకు భారీగా భక్తులు తరలివచ్చారు.
కాగా, లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ఈ నెల 28 వ తేదీ వరకు జరుగనున్నాయి. 24న స్వామివారి ఎదుర్కోలు, 25న తిరుకల్యాణం, 28న అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించి ఉత్సవాలకు ముగింపు పలుకనున్నారు. ఉత్సవాల సందర్భంగా నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమం, జోడు సేవలు, ఏకాదశి లక్ష పుష్పార్చనలను అధికారు రద్దు చేశారు.

# మహిళల ఆర్థిక సాధికారతే తెలంగాణ ప్రగతి

**- జాతీయ ఆర్థిక సాక్షరత సదస్సులో మంత్రి సీతక్క**

మహిళల ఆర్థిక సాధికారతే తెలంగాణ ప్రగతి అని మంత్రి సీతక్క అన్నారు. వారిని ఆర్థికంగా స్థితిమంతులుగా చేయడానికి ఇందిరా మహిళా శక్తి పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. జాతీయ ఆర్థిక సాక్షరత సదస్సులో మహిళా సాధికారతలో తెలంగాణ సాధించిన ఆర్థిక ప్రగతిని ఆవిష్కరించారు. 46.68 లక్షల మంది మహిళలు 4.37 లక్షల స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా ఎదుగుతున్నారని వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళా సా ధికారతకు పెద్దపీట వేస్తోందని చెప్పారు. గడిచిన రెండేండ్లలో మహిళా సంఘాలకు రూ.35.435 కోట్ల బ్యాంకింగ్ రుణాల మంజూరు చేశామన్నారు.ఇందిరా మహిళా శక్తితో 2.05 లక్షల సూక్ష్మ వ్యాపారాలను మహిళా సంఘాలు స్థాపించాయని చెప్పారు. సమ్మక్క, సారలమ్మ జాతరలో ప్రభుత్వ ప్రోత్సాహంతో మహిళా సంఘాలకు రూ.3.5 కోట్లు లాభాలు వచ్చాయన్నారు. వారికి స్థిరమైన ఆదాయం కల్పించేందుకు ఆర్టీసీ అ÷-దదె బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ ఎ÷-లాంట్లు మహిళా సంఘాలతో ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు. జీడీపీలో మన దేశ మహిళల భాగస్వా మ్యం 18 శాతమే నమోదైందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే అభివృద్ధి చెందిన దేశాల్లో ఇది 40 శాతంగా ఉందన్నారు. మంత్రి సీతక్క ప్రసంగాన్ని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రశంసించారు.

# రాయలసీమకు చంద్రబాబు తీరని ద్రోహం
## - గడికోట శ్రీకాంత్‌రెడ్డి విమర్శలు

రాయలసీమకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీరని ద్రోహం చేశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. రాయలసీమ ప్రాజెక్టుల విషయంలో కూటమి ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందని మండిపడ్డారు. ' బడ్జెట్ కేటాయింపుల్లో మహిళలకు, నిరుద్యోగులకు కేటాయింపులు లేవు. 50 ఏళ్లు దాటిన వారికి ఒక్కరికీ పింఛన్ ఇవ్వడం లేదు. ప్రతి మంగళవారం క్రమం తప్పకుండా అప్పులు మాత్రం చేస్తూ పోతున్నాడు. ప్రశ్నించేవారిపై దౌర్జన్యాలు చేస్తూ అరాచకపు పరిపాలన చేస్తున్నారు. దేవుడిపై కూడా రాజకీయాలు చేస్తూ భక్తుల మనోభావాలను దెబ్బ తీస్తున్నారు. ఏడు కొండలు, లడ్డూ వ్యవహారంలో అడ్డంగా దొరికిపోయారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాల్సిన ముఖ్యమంత్రి దిగజారిపోయి పక్క రాష్ట్ర ముఖ్యమంత్రితో ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఓటుకు నోటు కేసులో గురు శిష్యులిద్దరూ దొరికారు. శిష్యుడికి తెలంగాణలో మేలుచేయడం కోసం చంద్రబాబు రాయలసీమను తాకట్టుపెట్టారు. మార్చి 1 వ తేదీన రాయలసీమ సన్నాహక సమావేశం ఉంటుంది. చంద్రబాబు అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తాం' అని స్పష్టం చేశారు.

# కోల్‌కతా తరలిస్తున్న తాబేళ్ల పట్టివేత

అక్రమంగా కలకత్తాకు పెద్ద ఎత్తున తరలిస్తున్న తాబేళ్లను ఏలేశ్వరం అటవీశాఖ అధికారులు శనివారం జాతీయ రహదారిపై స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏలేశ్వరం అటవీ శాఖ అధికారి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కోనసీమ రామచంద్రాపురం నుండి కలకత్తాకు బొలెరో వాహనంపై తాబేళ్ళు తరలిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. వెంటనే తమ సిబ్బందితో దాడులు నిర్వహించగా 320 తాబేళ్ళు గోనిసంచెల్లో చుట్టుకుని బొలెరో వాహనంపై ఎక్కించి పైన ఎవరికీ అనుమానం రాకుండా చేపలు బుట్టలు వేశారన్నారు. ఈ కేసులో ఇద్దరిని అదుపులోకి తీసుకోగా వారి సమాచారం ప్రకారం కలకత్తా ప్రాంతాలలో ఈ తాంబేలుకు మంచి డిమాండ్ ఉందని మాత్రమే తెలిపారన్నారు. వేటికి వినియోగించేది తెలియ రాలేదని ఆయన పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిందితులను, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకుని తాబేళ్లను ఏలేరు రిజర్వాయర్లలో విడుదల చేసినట్లు అటవీశాఖ అధికారి తెలిపారు. నిందితులను యానిమల్ ప్రొడక్షన్ యాక్ట్ కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తున్నామన్నారు.

# ఇంటి యజమాని వేధింపులు

## ▪ గృహిణి ఆత్మహత్య



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
అల్వాల్ ఠాణా పరిధిలో ఇంటి యజమాని వేధింపులు తాళలేక తబస్సుమ్ (42) అనే గృహిణి ఆత్మహత్య చేసుకున్నారు. మహ్మద్ షాబీర్, తబస్సుమ్ దంపతులు నాలుగేళ్లుగా హస్మత్‌పేటలోని అబ్రహంనగర్‌లో అద్దెకు నివసిస్తున్నారు. కొన్ని నెలలుగా ఇంటి యజమాని షబ్బీర్, ఆయన కుటుంబ సభ్యులు తబస్సుమ్‌ను అవమానిస్తూ వేధించేవారు.
దీంతో రెండు రోజుల క్రితం వేరే అద్దె ఇంటికి మారినా, వేధింపులు ఆగకపోవడంతో శుక్రవారం సాయంత్రం తబస్సుమ్ భర్తకు ఫోన్‌లో సమాచారం ఇచ్చి, దుష్ప్రచారంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డారు.

# రిజిస్ట్రేషన్ల నిలిపివేత...

# బోడుప్పల్ లో ఆందోళన

## ▪ వక్ఫ్ నుండి విముక్తి కోరుతూ ప్రదర్శన

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
వక్ఫ్ బోర్డు పేరిట 8 ఏళ్లుగా రిజిస్ట్రేషన్లను నిలిపివేయడాన్ని నిరసిస్తూ ఆదివారం బోడుప్పల్ లో కాలనీవాసులు ఆందోళనకు దిగారు. రిజిస్ట్రేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. 2018 నుంచి రిజిస్ట్రేషన్లు ఆగిపోవడంతో 10వేల కుటుంబాలు అనిశ్చితిలో పడ్డాయని, ప్రతిపక్ష నేతగా హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని మరిచిపోయారని వారు మండిపడ్డారు.



# అక్రమ లక్కీడ్రా స్కీమ్‌పై పోలీసుల కొరడా

## .ఇద్దరి అరెస్ట్



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడిపల్లి పోలీసులు అక్రమ లక్కీ డ్రా స్కీమ్‌పై దాడులు నిర్వహించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. శనివారం బోడుప్పల్ సర్కిల్ పరిధిలో సౌదా సోతు సరస్వతి (47), సౌదా సోతు పరశురాం (27)లు కలిసి ప్రభుత్వం నిషేధించిన లక్కీ స్కీమ్‌ను నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఈ దాడులు జరిగాయి. కూపన్ ధర 299 రూపాయలుగా నిర్ణయించి, కారు, బైకులు, ఐఫోన్ వంటి బహుమతులు ప్రకటించి ప్రజలను ఆకర్షిస్తున్నట్లు గుర్తించారు. ఈ స్కీమ్‌కు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేవని, దీంతో వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

▪ ప్రైజ్ చిట్స్ అండ్ మనీ సర్కులేషన్ స్కీమ్స్ బానింగ్ యాక్ట్ 1978 ప్రకారము ఎలాంటి డ్రా స్కీములు నిర్వహించకూడదని, అది చట్టరీత్యా నేరమని పోలీసులు తెలియజేశారు

ప్రజలు ఇలాంటి అక్రమ స్కీమ్‌లు, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని మేడిపల్లి పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# మల్లాపూర్ బీజేపీ నాయకుల నిరసన



**గాజంగి మహేశ్వర్, కరపత్రం మెట్టుపల్లి**
జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం వివి రావుపేట్ లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆదివారం బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అరెస్టుకు నిరసనగా ఈ ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో బిజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు బైన ప్రశాంత్, సీనియర్ నాయకుడు పెనుకుల అశోక్, వెంపల్లి గ్రామ సర్పంచ్ గుగ్లవత్ రాజేందర్, వార్డ్ మెంబర్ వేముల నరేష్ పాల్గొన్నారు.

# త్రాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

## ▪ మెట్టుపల్లి మున్సిపల్ చైర్మన్ లింబాద్రి



**గాజంగి మహేశ్వర్, కరపత్రం మెట్టుపల్లి**
మెట్పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, ఆదివారం పట్టణంలోని ఒకటో వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకారి నవీన్ కుమార్ తో కలిసి పర్యటించారు. వార్డులో త్రాగు నీటి సమస్యను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా ఇందిరమ్మ ఇంటిలో గృహప్రవేశం చేసిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అరిగెల రాకేష్ కూడా పాల్గొన్నారు.

# మెట్ పల్లిలో కరాటే విద్యార్థులకు బెల్ట్ పరీక్షలు



**గాజంగి మహేశ్వర్, కరపత్రం మెట్టుపల్లి**
జగిత్యాల జిల్లా మెట్ పల్లిలో జె.కె.ఎ.ఐ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో 43 మంది కరాటే విద్యార్థులకు బెల్ట్ మరియు ఉత్తమ ప్రతిభ పరీక్షా కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. జిల్లా ప్రధాన కరాటే శిక్షకులు ఎస్. ప్రవీణ్ కుమార్ మాస్టర్ పర్యవేక్షణలో జరిగిన ఈ పరీక్షల్లో సీనియర్, జూనియర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కరాటే, ఆత్మరక్షణ విద్యలు విద్యార్థుల వ్యక్తిత్వ, శారీరిక, మానసిక వికాసానికి దోహదపడతాయని, యువత ఆసక్తితో నేర్చుకోవాలని ప్రవీణ్ కుమార్ మాస్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు మాస్టర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నామకరణ మహోత్సవంలో మంత్రి దామోదర్..

తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ వ్యక్తిగత సహాయకులు శ్రీధర్--నాగలక్ష్మి దంపతుల కుమార్తె నామకరణ మహోత్సవానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బుధవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని పద్మశాలి భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి, శ్రీధర్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. పాప (తన్విక) ను ఎత్తుకుని లాలించారు. ఈ సందర్భంగా శ్రీధర్ కుటుంబ సభ్యులతో కాసేపు సరదాగా గడిపిన మంత్రి వారిని దీవించారు. అలాగే ఈ కార్యక్రమంలో అందోలు-జోగిపేట మున్సిపల్ నూతన వైస్ చైర్మన్ చిట్టిబాబు, కౌన్సిలర్ కొశిక రాజశేఖర్, రామకృష్ణ, మాజీ కౌన్సిలర్ పిట్ల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ శ్రీ అయ్యప్ప స్వామి సేవార్తి ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సిరిమల్లె జయేందర్ స్వామి ఎంపిక

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఫిబ్రవరి 22**
జమ్మికుంట పట్టణానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక సేవకుడు, జమ్మికుంట అయ్యప్ప స్వామి సేవా సమితి అధ్యక్షులు సిరిమల్లె జయేందర్ స్వామి ని తెలంగాణ రాష్ట్ర స్థాయి ఆధ్యాత్మిక వేదిక అయిన తెలంగాణ శ్రీ అయ్యప్ప స్వామి సేవార్తి ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జిల్లాలోని అయ్యప్ప భక్తుల్లో ఆనందోత్సాహాలను నింపింది. ఇటీవల హైదరాబాద్ నగరంలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో నూతన కమిటీని ఘనంగా ఏర్పాటు చేయగా, అందులో భాగంగా జయేందర్ స్వామి కి రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి అప్పగించడం విశేషంగా నిలిచింది.
ఈ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అయ్యప్ప స్వామి సేవా సమితుల ప్రతినిధులు, ఆధ్యాత్మిక ప్రముఖులు, సేవాదారులు హాజరై ఐక్యవేదిక భవిష్యత్ కార్యాచరణపై విస్తృత చర్చలు జరిపారు. రాష్ట్ర అధ్యక్షులుగా వాకిటి భాస్కరరావు , ఉపాధ్యక్షులుగా సిరిమల్లె జయేందర్ స్వామి తో పాటు కటకం మల్లేశం, రాంచందర్ , తుమ్మల నాగేంద్రప్రసాద్, రుద్రగోని వెంకటేశం గౌడ్ ను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా దురుగు మహంతి మోహన్ రావు , కోశాధికారిగా వివిఆర్‌పి ప్రసాద్ ని ఎన్నుకుని పూర్తి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు.



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయాల కార్యవర్గాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సమన్వయంతో సేవా కార్యక్రమాలను నిర్వహించడం తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. అయ్యప్ప స్వామి దీక్షాధారుల సౌకర్యార్థం ప్రత్యేక సేవా కార్యక్రమాలు, అన్నదానాలు, వైద్య శిబిరాలు, భక్తుల శిక్షణా శిబిరాలు, యువతకు ధార్మిక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.
అలాగే హిందూ ధర్మ పరిరక్షణ, సాంప్రదాయ విలువల పరిరక్షణ, ఆలయాల అభివృద్ధి, భక్తుల ఐక్యత కోసం ఐక్యవేదిక పలు ప్రణాళికలను సిద్ధం చేస్తోందని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా అయ్యప్ప స్వామి ఆలయాల మధ్య పరస్పర సహకారం పెంపొందించి, ప్రతి జిల్లాలో సేవా విస్తరణకు కృషి చేయనున్నట్లు తెలిపారు.
రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన జయేందర్ స్వామి మాట్లాడుతూ, “ఇది నాకు వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదు, జమ్మికుంట పట్టణానికి వచ్చిన గౌరవం. భక్తుల ఆశీస్సులు, పెద్దల మార్గదర్శకత్వంతో రాష్ట్రవ్యాప్తంగా అయ్యప్ప స్వామి సేవా కార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తాం” అని తెలిపారు.
ఆదివారం జమ్మికుంటలో జరిగిన సన్మాన కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగింది. అయ్యప్ప స్వామి సేవా సమితి సభ్యులు, భక్తులు, పట్టణ ప్రముఖులు కలిసి జయేందర్ స్వామి కి పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. పలువురు భక్తులు మాట్లాడుతూ జయేందర్ స్వామి సేవా తపన, వినయం, సంఘటిత నాయకత్వం కారణంగానే ఈ బాధ్యత దక్కిందని కొనియాడారు.
ఈ సందర్భంగా భక్తులు హర్షం వ్యక్తం చేస్తూ “స్వామియే శరణం అయ్యప్ప” నినాదాలతో కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా ముగించారు. జమ్మికుంట నుంచి రాష్ట్ర స్థాయికి ఎదిగిన జయేందర్ స్వామి ఎంపిక స్థానిక భక్తులకు ప్రేరణగా నిలుస్తూ, సేవా మార్గంలో మరిన్ని కార్యక్రమాలకు దారి చూపుతుందని సభ్యులు అభిప్రాయపడ్డారు.. ఈ కార్యక్రమంలో ఏ రాజేంద్రప్రసాద్. సామల ప్రతాప్ రెడ్డి. ఇమ్మడి భాస్కర్.. దామోదర్ వెంకట్ రెడ్డి.మురళి.అశోక్ తదితరులు పాల్గొన్నారు

# మైనార్టీలపై బీఆర్‌ఎస్ కపట ప్రేమ..

– కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు ఎండి ఇమ్రాన్

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్:**
ముస్లింల పట్ల ప్రేమ ఉందని చెప్పుకునే హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి లకు నిజంగా మైనార్టీలపై చిత్తశుద్ధి ఉంటే సిరిసిల్లలో మున్సిపల్ చైర్మన్ లేదా వైస్ చైర్మన్ పదవులు మైనార్టీలకు ఎందుకు ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు ఎండి ఇమ్రాన్ ప్రశ్నించారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ.. జమ్మికుంట పట్టణంలో బీఆర్‌ఎస్ పార్టీ గెలిచి ఎస్సీ (జనరల్) చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా ముస్లిం సోదరుడికి పదవి ఇచ్చామని చెప్పుకుంటున్న ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మాత్రం మైనార్టీ వర్గానికి ఆ అవకాశాన్ని ఎందుకు కల్పించలేదని నిలదీశారు. “మీ నాయకుడు కేటీఆర్ కు మైనార్టీలపై ప్రేమలేదని మీరు బహిరంగంగా ఒప్పుకుంటున్నట్లేనా?” అని



ప్రశ్నించారు.
హుజురాబాద్ పట్టణ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ గెలిచినప్పటికీ, సీనియర్ మైనార్టీ నాయకులు ఉన్నప్పటికీ వైస్ చైర్మన్ పదవి ఇవ్వలేదని ఆరోపించే హక్కు ఎమ్మెల్యేకు లేదన్నారు. గత ఐదేళ్ల మున్సిపల్ పాలనలో కనీసం కో-ఆప్షన్ సభ్యుడిని కూడా నియమించలేని పరిస్థితిలో ఉన్న వారు ఇప్పుడు మైనార్టీలపై కాపట ప్రేమ నటించడం ప్రజలు గమనించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటుందనే ఆరోపణల్లో వాస్తవం లేదని ఇమ్రాన్ స్పష్టం చేశారు. మైనార్టీ సోదరులను గుర్తించి తగిన ప్రాధాన్యత కల్పిస్తున్నదే కాంగ్రెస్ పార్టీ అని పేర్కొన్నారు. రాజకీయ అవసరాల కోసం కులమతాలను వాడుకుని, అవసరం ముగిసిన తర్వాత మాట మార్చే నాయకులను ప్రజలు బాగా గమనిస్తున్నారని, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చేసిన ఆరోపణలకు భవిష్యత్తులో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ఇమ్రాన్ పేర్కొన్నారు.

# బెడెన్ పావెల్ 169 జయంతి

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఫిబ్రవరి 22:**
గోదావరిఖని బెడెన్ పావెల్ పార్క్ ఆదివారం భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకులు బెడెన్ పావెల్ 169 జయంతి, వరల్డ్ థింకింగ్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమమునకు ముఖ్య అతిదిగా ఆర్.జి1 యస్.ఓటు జియం కే.చంద్రశేఖర్ హాజరై బెడెన్ పావెల్ విగ్రహానికి పూలమాలను వేసి నివాళులు అర్పించారు. అనంతరం భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాల నుండి వచ్చిన 200 మంది స్కౌట్ అండ్ గైడ్స్ లతో శాంతి ప్రగతి యాత్ర చేసారు.
ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ముఖ్య అతిది యస్.ఓ.టు జియం మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలో బెడెన్ పౌల్ గారు ఒక నూతన ఒరవడిని స్థాపించి ప్రపంచ వ్యాప్తంగా నిస్వార్ధ సేవలో ఎందరికో స్ఫూర్తి ప్రధాతగా నిలిచారని మరియు దేశ సేవాలో విద్యార్థి దశ నుండి ఒక సైనిక వ్యవస్తవలే విద్యార్థులను భారత్



స్కౌట్ అండ్ గైడ్స్ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇస్తూ దేశం గర్వించదగ్గ వారి ఆదర్శాలను కొనసాగిస్తూన్నారని వీరి సేవలు మరువలేనివని కొనియాడారు. స్కౌటింగ్ గురించి వివిధ మెలుకువలు, ప్రాణప్రాయ పరిస్థితిలో తీసుకోవల్సిన చర్యల గురించి వివరించారు. ఈ సందర్భముగా ఆదివారం కుడా పాల్గొన్న స్కౌట్ అండ్ గైడ్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.. అనంతరం ఫస్ట్ ఎయిడ్ చికిత్స గురించి, ఉదయం నుండి సాయంత్రం వరకు స్కౌట్స్ మరియు గైడ్స్ కు



వివిధ ఆటల పోటీలు, శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమములో అధికారుల సంఘం అధ్యక్షులు కోలా మల్లేశం, ఏఐటియుసి బ్రాంచి సెక్రటరి రంగు శ్రీను, డిప్యూటి పర్సనల్ మేనేజర్ నాగుల వేణు, సీనియర్ పిఒ హనుమంత రావు, స్కౌట్స్, గైడ్స్ గట్టుమల్లు, కె.బుచ్చయ్య, ఎ.దేవేందర్. డి.కుమార్, జే.రవీందర్, సాంబయ్య, ఎం.డి. భషీర్, నిజాముద్దీన్, శశికళ, లక్ష్మి కుమార్, జ్యోతి, నీలిమ, పద్మజ, పాఠశాలల స్కౌట్ మరియు గౌడ్స్ విద్యార్థులు తదితరులు పాల్గోన్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
సోమవారం ఫిబ్రవరి 23, 2026

# జమ్మికుంట మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లకు ఘన సత్కారం....

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, ఫిబ్రవరి 22**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ చైర్మన్ ములుగు ప్రశాంత్ (దిలీఫ్), వైస్ చైర్మన్, 21వ వార్డు సభ్యుడు చింతల శ్రీను లను జమ్మికుంట మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పట్టణంలోని ఓ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమం హర్షోల్లాస వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు మాట్లాడుతూ, కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు పట్టణ అభివృద్ధికి సమగ్ర దృష్టితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా ప్రజల ఆరోగ్య పరిరక్షణలో మున్సిపాలిటీ కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రైవేట్ క్లినిక్‌లు, మెడికల్ షాపులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడంలో మున్సిపల్ యంత్రాంగం సహకారం అవసరమని పేర్కొన్నారు.
పట్టణంలో పారిశుద్ధ్యం, శుభ్రత, చెత్త నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, డ్రైనేజ్ లైన్లను శుభ్రపరిచే పనులను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. వర్షాకాలంలో నిల్వ నీటి




సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. దోమల నివారణ కోసం ఫాగింగ్ కార్యక్రమాలను నియమితంగా నిర్వహించాలన్నారు.
అలాగే ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, ముఖ్య కూడళ్ల వద్ద ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఆసుపత్రుల సమీప ప్రాంతాల్లో పార్కింగ్ సదుపాయాలు కల్పించడం ద్వారా రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. రోడ్ల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు వంటి అంశాలు కూడా అత్యవసరమని తెలిపారు.
మున్సిపల్ చైర్మన్ ములుగు ప్రశాంత్ (దిలీఫ్) మాట్లాడుతూ, పట్టణ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. మెడికల్ అసోసియేషన్ సూచనలను సానుకూలంగా స్వీకరిస్తూ, ఆరోగ్యానికి సంబంధించిన అంశాలకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. వైస్ చైర్మన్ చింతల శ్రీను కూడా మాట్లాడుతూ, ప్రతి వార్డులో సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో మెడికల్ అసోసియేషన్ సభ్యులు, మెడికల్ షాప్ యజమానులు, పట్టణ ప్రముఖులు, యువ నాయకులు పాల్గొని నూతన ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేశారు. సత్కార కార్యక్రమం అనంతరం పరస్పర చర్చలు, అభిప్రాయ మార్పిడి కార్యక్రమం కూడా జరిగింది.
పట్టణ అభివృద్ధి మరియు ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం పరస్పర సహకారంతో ముందుకు సాగాలని అందరూ సంకల్పించారు.

# రెడ్డిపల్లిగ్రామంలోని విద్యుత్ లో వోల్టేజ్ సమస్యను తీర్చిన రెడ్డిపల్లి సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట ఫిబ్రవరి 22**



మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా సింగిల్ ఫేస్ ట్రాన్స్ఫార్మర్ తో తక్కువ వోల్టేజ్ విద్యుత్ సమస్యను పరిష్కరించిన రెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్ గ్రామంలో తక్కువ వోల్టేజ్ తో సింగిల్ ఫేస్ విద్యుత్ సరఫరా చేయడం వల్ల ఇట్లో ఎలక్ట్రిక్ వస్తువులు రిపేర్ ప్రమాదాలు ఘటనలను దృష్టిలో ఉంచుకొని నూతన సింగిల్ ఫేస్ బుడ్డి ఏర్పాటు చేయడం జరిగింది. విద్యుత్ సమస్య పరిష్కరించినందుకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్మెన్ రఘుపతి సెక్రెటరీ రమేష్ వార్డు సభ్యులు, గ్రామపంచాయతీసిబ్బందినాయకులు, ప్రజలు తదితరులు పాల్గొనారు

# క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా వెల్దుర్తి కస్తూర్బా బాలికల పాఠశాలను ప్రభుత్వ ఆసుపత్రి పరిశీలించిన మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట ఫిబ్రవరి 22**
గ్రామీణ, వెనుకబడిన వర్గాల బాలికలకు నాణ్యమైన విద్యను అందిస్తూ, చదువుకు దూరమైన ఎంతోమంది జీవితాల్లో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు వెలుగులు నింపుతున్నాయని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఆదివారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్. మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలో ని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను కలెక్టర్ పరిశీలించారు. హాస్టల్లోని నిత్యావసర సరుకులను, స్టోర్ రూంను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందజేయాలని. నిత్యావసర సరకులను సరఫరా చేసే ఏజెన్సీ వారు నాణ్యమైన వస్తువులను మాత్రమే అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు ఖచ్చితంగా మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని అన్నారు. విద్యార్థులను పలు



ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. విద్య బోధన, భోజన సదుపాయం ఇతర మౌలిక వసతులు ఎలా ఉన్నాయి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా వచ్చే బోర్డు పరీక్షల దృష్ట్యా విద్యార్థులందరూ 10 జీపీఏ సాధించేందుకు ఉపాధ్యాయులు సమగ్ర వ్యూహాన్ని అమలు చేయాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ రోగులకు అందుతున్న సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సిబ్బంది విధిగా హాజరుకావాలని ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా గాంధీ విద్యాలయం ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# భారత విద్యా ప్రదాత మౌలానా ఆజాద్

**– యూత్ కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి సజ్జాద్ మొహమ్మద్**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట:ఫిబ్రవరి 22**



కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో ఆదివారం రోజున మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి వేడుకలు యూత్ కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు మొహమ్మద్ దౌలత్ పాషా ఆధ్వర్యంలో పూలదండ వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యూత్ కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి సజ్జాద్ మొహమ్మద్ మాట్లాడుతూ.. మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశ స్వతంత్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించి అఖిలభారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అతి చిన్న వయసులో బాధ్యతలు చేపట్టి తనదైన శైలిలో స్వాతంత్ర ఉద్యమాన్ని ఉధృతపరిచి నాడు స్వాతంత్ర తర్వాత భారత దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా నెహ్రూ క్యాబినెట్లో అనేక సంస్కరణలు తీసుకువచ్చి దేశం ఈరోజు ఇంత అభివృద్ధిలో ఉందంటే నాడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ వేసిన బీజమే అని గర్వంగా చెప్పుకోవచ్చు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి సలీం, యూత్ కాంగ్రెస్ హుజరాబాద్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పాతకాల రమేష్, ( ఎన్ ఎస్ యూ ఐ )కరీంనగర్ జిల్లా కార్యదర్శి అజ్మత్, స్టార్ రఫీ, అయ్యుబ్, పాషా, సల్లు బాబా, అశ్రఫ్, హాజీ, రషీద్, జావీద్, అహ్మద్, ఫాకురుద్దీన్, గఫ్ఫార్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ మైనారిటీ చైర్మన్ మోహమ్మద్ తాజుద్దీన్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం ఆజాద్ వర్ధంతి వేడుకలు

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఫిబ్రవరి 22**
భారత దేశ మొట్ట మొదటి ప్రధాని మంత్రి జవహర్ లాల్ నెహ్రూ క్యాబినెట్లో మొట్ట మొదటి విద్యా శాఖ మంత్రి గా ,భారత దేశ పార్టీ అధ్యక్షునీ గా భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 68 వ వర్ధంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ మైనారిటీ చైర్మన్ మొహమ్మద్ తాజోద్దీన్ ఆధ్వర్యంలో చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి విచ్చేసి తాజోద్దీన్ తో కలసి ఫోటో కు పూల




మాల వేసిన అనంతరం మాట్లాడుతూ భారత దేశంలో విద్య కు సంబంధించి ఎన్నో సంస్కరణలు తీసుకోవచ్చారనీ ,ఐఐటీ ,యూజీసీ ,గరీబీ హటావో అనే నినాదంతో ముందుకు సాగుతూ విద్యను ప్రతి గ్రామానికి వెళ్లి అభివృద్ధి చేశారనీ ,స్వతంత్ర ఉద్యమంలో 10 సంవత్సరాలు జైలు శిక్ష కూడ అనుభవించారనీ ,ఇలాంటి మహా నేత అడుగు జాడల్లో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త నడవాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు నేహాల్ అహ్మద్ లయీఖ్ ఖాద్రీ సయ్యద్ ఖమరోద్దీన్ మొహమ్మద్ కలిమొద్దీన్ ఖాజా ఖాన్ ఈక్రమ్ సికిందర్ సలిమొద్దీన్ సాగర్ బషీర్ అబ్దుల్ బారి ఎండీ సలీం రాజ్ కుమార్ అజీం సయ్యద్ కరీం జమీల్ ఇమ్రాన్ ముజాహిద్ ఆరిఫ్ ఖాన్ ఇమ్రాన్ ఘనీ రమేష్ హనీఫ్ మున్నా తదితరులు పాల్గొన్నారు.

# U-13 జూనియర్స్ , ఓపెన్ చెస్ టోర్నమెంట్ - ప్రారంభించిన డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఫిబ్రవరి 22**



భగత్ నగర్ లో జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఓపెన్ & జూనియర్స్ చెస్ టోర్నమెంట్ ను ప్రారంభించి డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ చెస్ ఎంతో మేధాశక్తిని పెంచుతుందని ప్రతి మనిషి తప్పకుండా నేర్చుకోవాల్సిన గేమ్ అని అన్నారు .కరీంనగర్ జీనియస్ చెస్ అనూప్ సేవలు గుర్తు చేస్తూ వేద భవన్, బాల కుటీర వంటి పిల్లలకు ఎంతమంది విద్యార్థులకు ఉచితంగా చెస్ నేర్పించడం గొప్పతనమని అన్నారు . తదుపరి చెస్ గేమ లో మొదటి ఎత్తున ప్రారంభించారు . ఈ కార్యక్రమం లో జీనియస్ చెస్ అకాడమీ చైర్మన్ కంకటి కనకయ్య, పండుగ నాగరాజు, నూనె సాయికృష్ణ, డైరెక్టర్ అనూప్ కుమార్ కోఆర్డినేటర్ సృజన్ కుమార్ , చీఫ్ ఆర్బిటర్ అనిల్ ,వెంకన్న ,అకాడమీ కోచ్ లు అభిరామ్ ,రేవిక్ , ప్రభు , శ్రీనిజ, స్వాతి, సిరి తదితరులు తదితరులు పాల్గొన్నారు.

# శివంపేట మండలం గుండ్లపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజి రెడ్డి

**– గుండ్లపల్లి సర్పంచ్ మమత నరసింహ యాదవ్**

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట ఫిబ్రవరి 22**
మెదక్ జిల్లా శివంపేట మండలంగుండ్లపల్లి గ్రామంలో సర్పంచి పెంజర్ల మమత నరసింహనర్సింహ యాదవ్ ఆధ్వర్యంలో మస్కూరి సరిత ప్రేమ్ దాస్ ఇందిరమ్మ ఇల్లు ను ప్రారంభం చేసిన నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ఆవుల రాజిరెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మూడో తారీకు జరిగినటువంటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నిరుపేద ప్రజలకు సొంత స్థలం ఉంటే ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా వారికి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం నగదు సదుపాయాన్ని కల్పిస్తుందని ఎన్నికల ముందు ఇచ్చినటువంటి హామీని మాట తప్పకుండా వారికి ఇందిరమ్మ పథకం ద్వారా ఇంటి నిర్మాణాలు చేపట్టడమే కాకుండా కొన్ని గ్రామాలలో ఇందిరమ్మ



ఇండ్లు పూర్తి అవ్వడంతో ఇందిరమ్మ ప్రారంభించి లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సొంత ఇంటి కల ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా నెరవేరిందని ఆయన అన్నారు రోజుల్లో మరిన్ని అభివృద్ధి పథకాలను ప్రవేశ పెట్టే విధంగానే తెలంగాణకాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసే ప్రయత్నంలోనే ఉంటే ప్రతిపక్ష నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నటువంటి అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక లేనిపోనీ ఆరోపణలు చేస్తున్నారా తప్ప పది సంవత్సరాలు తిన్న ప్రాణం పదవి అనుభవించిన కుళ్ళు కుతంత్రాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు అలాంటి ఆరోపణలు ప్రతిపక్ష నాయకులు మానుకోవాలని పత్రికాముకంగా వారికి తెలియజేస్తున్నామని రానున్న రోజుల్లో అసెంబ్లీ ఎన్నికల్లోకూడా మళ్లీ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే పరిపాలన సాగుతుందని కంఠం ముక్తంగాతెలియజేస్తున్నానని ఆయన తెలియజేశారు
కార్యక్రమంలో చింతల వెంకట్ రామ్ రెడ్డి మాధవ రెడ్డి నవీన్ గుప్తా పాము బండ సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి గోమారం సర్పంచ్ ఆంజనేయులు సర్పంచుల పోరు అధ్యక్షుడు మురళి దంతాలపల్లి సర్పంచ్ మమత నర్సింలు మాజీ సర్పంచ్ తాటి కిష్టయ్య ఉప సర్పంచ్ మస్కూరి సత్యనారాయణ వార్డ్ మెంబర్స్ ఉప్పునూతల దత్తు గౌడ్ మస్కూరి సంతోష పరశురాం దేవుని రేణుక నర్సింలు ఇందూరి రాజు ఉప్పునూతల సత్యనారాయణ ఎండి గ్రామ పెద్దలు వంచ సత్యనారాయణ రెడ్డి తాళ్ల శ్రీనివాస్ చిత్తబోయిన శ్రీనివాస యాదవ్ నక్కలపల్లి మల్లేష్ యాదవ్ బజారి నరసింహారెడ్డి ఎలికంటి వినోద్ కుమార్ హరి సట్టివిట్టల్ బజారి లక్ష్మారెడ్డి గడ్డం సతీష్ గ్రామ పెద్దలు యువకులు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఇ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# రామ్మోహన్ నాయుడిని తొలగించండి

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడిని తక్షణమే పదవి నుండి తొలగించాలని కోరుతూ ఎన్‌సిపి (శరద్‌పవార్) ఎమ్మెల్యే రోహిత్ పవార్ శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఒక లేఖ రాశారు. ఈ ఏడాది జనవరి 28న బారామతి ఎయిర్‌పోర్టులో జరిగిన విమాన ప్రమాదంలో మహారాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి అజిత్ పవార్ సహా ఐదుగురు చనిపోయిన సంగతి తెలిసిందే. ఒక కుట్రలో భాగంగానే నాటి ప్రమాదం జరిగిందని, విమానయాన సంస్థకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న టిడిపికి సన్నిహిత సంబంధాలున్నాయని ఆయన
ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రమాదంపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని మోడీకి తన లేఖలో రోహిత్ విన్నవించారు. ఇదే విషయంపై ఆయన మీడియాతోనూ మాట్లాడారు. నాటి ప్రమాదం వెనుక రెండు కోణాలు వుండేందుకు అవకాశం వుందని అవి రాజకీయ లేదా వాణిజ్యపరమైన కోణాలు కూడా కారణం కావచ్చని ఆయన పేర్కొన్నారు. వాటిల్లో ఏది కారణమనేది తేల్చుకోవాలని తమ పార్టీ ప్రయత్నిస్తోం దన్నారు. ఒక కుట్రలో భాగంగానే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ఎయిర్ చార్టర్ కంపెనీ విఎస్‌ఆర్‌కు ఇందులో ప్రమేయం వుందన్నారు. విఎస్‌ఆర్ కంపెనీ గురించి, రామ్మోహన్ నాయుడు పార్టీ తెలుగుదేశంతో దానికి గల సంబంధాల గురించి అనేక తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయన్నారు. అందువల్ల స్వతంత్ర, సమర్ధవంతమైన అధికారితో ఈ సంబంధాలపై దర్యాప్తు జరగాలన్నారు. ప్రాధాన్యతా ప్రాతిపదికన అంతర్జాతీయ సంస్థల సహకారం తీసుకోవాలని ఆ లేఖలో ఆయన సూచించారు. లేఖ ప్రతిని కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు కూడా పంపారు. అజిత్ పవార్‌కు సన్నిహిత బంధువు అయిన రోహిత్ పవార్ మొదట నుండి ఈ ప్రమాదంలో కుట్ర కోణం వుందంటూ మీడియాతో మాట్లాడుతునే వస్తున్నారు. పారిశ్రామిక, రాజకీయ రంగాలకు చెందిన అనేకమంది పలుకుబడి కలిగిన వ్యక్తులు ఈ విఎస్‌ఆర్‌లో వున్నారని తన నిర్ధారణల్లో తేలిందన్నారు. ఈ కారణంగానే దర్యాప్తు ప్రక్రియ పారదర్శకంగా జరగబోదని తాను భావిస్తున్నానన్నారు. విఎస్‌ఆర్‌కు సంబంధించి ఏ రీతిలోనైనా డిజిసిఎ రాజీ పడిందా లేదా అనే అంశంపై దర్యాప్తు జరిగే సమయంలో ఎలాంటి ప్రభావాలు లేదా జోక్యాలు లేకుండా చూడాలని కోరుతున్నట్లు రోహిత్ పవార్ ఆ లేఖలో కోరారు.